


రూ.14.25 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయ చిన్న తిరునాళ్ల సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలంలో రూ.14.25 లక్షల ఆదాయం వచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఏఎస్పీ విఠలేశ్వర్ బాధ్యతల స్వీకారం



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీగా బదిలీ అయినా టి.పి.విఠలేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
చిలకలూరిపేట	6.26	5.03
గుంటూరు	6.22	5.02
బాపట్ల	6.22	5.02

న్యూస్‌రీల్

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.20.91 లక్షలు



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకల లెక్కించారు. మహాశివరాత్రి అనంతరం హుండీల కానుకల లెక్కింపు దేవదాయశాఖ ఉత్సవ అధికారి పైదమ్మబాయి సమక్షంలో దేవాలయంలో ఉన్న పది హుండీలను లెక్కించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి గోపినాథశర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ.7,98,801 వచ్చినట్లు తెలిపారు. ఏడు రోజులలో వివిధ పూజా టికెట్ల ద్వారా రూ.12,86,381 ఆదాయం వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ నగదు మొత్తాన్ని వివిధ బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాకు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దొండపాడు సేవాసమితి, గుంటూరు సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్దూ పాఠశాలలు ఒంటి పూట

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఒంటి పూట తరగతులను నిర్వహించాలని డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాంతర ఉర్దూ మాధ్యమం నిర్వహిస్తున్న పాఠశాలలు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు. ఉప విద్యాశాఖాధికారులతో పాటు ఎంఈవోలు, హెచ్ఎంలు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అమరేశ్వర ఆలయంలో వసంతోత్సవం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత స్వామికి చూర్ణోత్సవ అనంతరం వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉత్సవమూర్తులకు స్నపన చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం స్వామికి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంత సేవామహోత్సవాలు ప్రారంభమవుతాయి.

యార్డుకు 1,44,196 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,44,196 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,33,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.19,500 వరకు పలికింది. నాన్‌ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,700 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,00,209 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

చెంతనే సంజీవని

పట్టణ ప్రజలకు ఆరోగ్య భరోసా

- జిల్లాలో 26 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు
- సత్వర సేవలు అందించటమే లక్ష్యం
- శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు
- ఒక్కో భవనానికి రూ. 80 లక్షలు



సత్తెనపల్లిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్



సత్తెనపల్లి: డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. అత్యాధునిక, నాణ్యమైన వైద్యం అందించేందుకు ఈ సెంటర్లు దోహద పడుతున్నాయి. వైద్యపరంగా ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా పెద్దాసుపత్రికి వెళ్లకుండానే వైద్యం అందుతోంది. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ వైద్యం అంతంత మాత్రంగానే ఉండేది. చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం కోసం చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణాల్లో అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్లు ఏర్పాటుతో పాటు నాడు - నేడులో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు 108, 104 సేవలను బలోపేతం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఇలా..

పట్టణం	సెంటర్లు	వైద్యులు	సిబ్బంది
నరసరావుపేట	05	05	30
చిలకలూరిపేట	07	07	02
సత్తెనపల్లి	03	03	18
వినుకొండ	02	02	12
పిడుగురాళ్ళ	02	02	12
మాచర్ల	03	-	14
దాచేపల్లి	02	01	12
గురజాల	01	01	06
మొత్తం	23	21	106

ఆరోగ్య సేవలు...

జిల్లావ్యాప్తంగా 26 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్లలో ఒకటి చొప్పున నాలుగు కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా మిగిలినవి శాశ్వత భవనాలను నిర్మించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలను కూడా శాశ్వత భవనాల నిర్మాణంలో ఉన్నాయి. భవనానికి ప్రభుత్వం రూ.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా భవనాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సత్తెనపల్లిలో మూడు భవనాలు ప్రారంభానికి సిద్ధం చేశారు.

పూర్తిస్థాయి సిబ్బందితో సేవలు..

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు వైద్యులు, సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించింది. ఒక్కో సెంటర్‌లో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక సహాయకుడిని నియమించారు. అక్కడే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరం ఉంటే పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో పది పడకలతో ఇన్ పేషెంట్ విభాగం, 68 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచారు.



సత్తెనపల్లి ఏఎంసీ సమీపంలో ప్రారంభానికి సిద్ధమైన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

పక్కాగా డేటా ఎంట్రీ..

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్‌లో వైద్య సేవలతో పాటు రోగుల డేటా ఎంట్రీ చేస్తున్నారు. మహిళల రక్త మోతాదుల శాతం నమోదు, ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించే ఇతర వైద్యసేవల కోసం ఆయా సెంటర్ల పరిధిలో సచివాలయం సిబ్బందిచే వివరాలు సేకరించి వైద్యసేవలతో పాటు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పట్టణ ప్రజలకు ప్రయోజనం..

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పట్టణాల్లో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడంతోపాటు అన్నిరకాల మందులు అందుబాటులోకి తీసుకువచ్చింది. చిన్నపాటి వైద్యం కోసం కూడా పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలందిస్తోంది. ఈ సెంటర్లు అందుబాటులోకి రావడంతో పట్టణ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

-డాక్టర్ బి.రవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పల్నాడు

స్పందన అర్జీలు సత్వర పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్
- స్పందనకు 85 అర్జీలు



స్పందనలో బాధితురాలి సమస్య వింటున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట: ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో 'జగనన్నకు చెబుదాం' సోమవారం నిర్వహించారు. స్పందనలో 85 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు. జిల్లా డీఆర్వో కె.వినాయకం, పులిచింతల ప్రత్యేక అధికారి శ్రీరాములు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీ దారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేశారు.

టిడ్కో ఇల్లు ఇవ్వట్లేదు..

నాకు కేటాయించిన టిడ్కో గృహం నా భర్త చనిపోయిన తర్వాత ఇవ్వడం లేదు. నా భర్త బతికి ఉండగా పాలు కూడా పొంగించాం. అది కాకుండా వేరే సగం పూర్తయిన గృహం చూపించి అది తీసుకోమంటున్నారు. నా ఇల్లు ఇప్పించి నాకు న్యాయం చేయండి.

- కె.సునీత, చిలకలూరిపేట టౌన్

పీఏసీఎస్‌లకు సహకారం అందిస్తాం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము



మాట్లాడుతున్న చైర్మన్ రాము

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు పూర్తి సహకారం అందించనున్నట్లు ఆ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) తెలిపారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జీడీసీఎంఎస్ మహాజన సభ సమావేశం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. తొలుత జీడీసీఎంఎస్ 2021-22 ఆడిట్ రిపోర్టు, 2023-24 జమ ఖర్చులు, 2024-25 అంచనా బడ్జెట్‌ను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జీడీసీసీబీ చైర్మన్ రాము మాట్లాడుతూ మూడేళ్లుగా సహకార రంగంలో వస్తున్న నూతన అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. మారుతున్న విధివిధాలకు అనుగుణంగా సహకార సంఘాలు పనితీరు మార్చుకోవాలని కోరారు. నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలని కోరారు. రాష్ట్రంలోనే గుంటూరు డీసీఎంఎస్ ప్రథమ స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 43 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ 2022-23 సంవత్సరం ఆడిట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ల వెంకట శివ, ఆరికట్ల విజయ భాస్కరరెడ్డి, ప్రసాదం బాల గురవమ్మ, పాల్వాయి ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు, జీడీసీసీబీ పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, నిజాంపట్నం రైతు సలహా మండలి అధ్యక్షుడు యార్లగడ్డ మదన్ మోహన్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతో ప్రకృతి సాగు

- పొదుపు సంఘాల మహిళలతో ప్రకృతి వ్యవసాయం
- అన్ని మండలాల్లో అవగాహన పూర్తి
- జిల్లాలోని అన్ని గ్రామాలను బయో గ్రామాలుగా మార్చడమే లక్ష్యం
- నిర్వహణకు సిద్ధమంటూ గ్రామ సమాఖ్యలు తీర్మానాలు



ప్రకృతిసాగులో భాగంగా తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తెలిపే చక్రం

యడ్లపాడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో 90 శాతం మందికి జీవనోపాధి వ్యవసాయమే. వీరిలో 60 శాతం సాగు చేస్తుండగా, భూమి లేని మరో 30 శాతం మంది వ్యవసాయ కూలీలుగా వ్యవహరిస్తున్నారు. ప్రకృతి సేద్యంపై వీరికి అవగాహన కల్పించి, నైపుణ్యాలను మెరుగు పరిచి పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో నడిపించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వచ్చే ఐదేళ్లలో స్వయం సహాయక సంఘ సభ్యులందర్నీ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడమే దీని ముఖ్య ఉద్దేశం. రైతు సాధికార సంస్థ సాంకేతిక, ఆర్థిక సహకారం.. సెర్ప్ ద్వారా మండల సమాఖ్యల శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాల వృద్ధి, మెరుగైన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

బయో గ్రామాలుగా..

జిల్లాలోని ప్రతి గ్రామాన్ని వంద శాతం బయో(రసాయన రహితం)గా మార్చడమే ప్రకృతి వ్యవసాయం ముఖ్యోద్దేశం. గతేడాది 45 వేల ఎకరాలను జిల్లా రైతులు వివిధ పంటలను ప్రకృతి సాగు చేయగా, ఈ ఏడాది 79 వేల ఎకరాల్లో విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గతంలో ఐదు ఎకరాలు ఒక కాంపాక్ట్ బ్లాక్‌గా సమీప రైతులతో మండలానికి ఒకటి చొప్పున సాగు చేయించగా, దానిని పది ఎకరాలకు పెంచి, ప్రతి వీఓ పరిధిలో 2 కాంపాక్ట్ బ్లాక్‌లు చేయాలని లక్ష్యం చేసింది. ఎన్‌పీఎం స్టాల్స్ జిల్లాలో 200 ఉండగా విద్యావంతులు, యువతతో రెట్టింపు చేయనుంది. అలాగే స్టాల్స్, ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పడం, మహిళా సంఘంలోని కనీసం ఒక సభ్యురాలిచే దేశీయ ఆవుల్ని కొనేలా చేయనుంది. ఇందుకు స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ నిధుల నుంచి విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించనుంది.

మేము తింటూ.. అమ్ముకుంటూ...



మూడేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నా. డ్వాక్రా మీటింగ్‌లో దీని గురించి తెలిసింది. వీఓ ద్వారా లోన్‌లో ఒక ఆవును కొని ఈవిధానం చేపట్టా. ఇంట్లో అందరం ప్రకృతితో పండించిన ఆహారం తీసుకుంటూ సంతోషంగా ఉన్నాం. మేము పండించిన కూరగాయలు, ఆకుకూరలు స్కూళ్లు, అంగన్‌వాడీల్లో అమ్ముకుంటూ ఆదాయం పొందుతున్నాం.

– కె.పూజ, పొదుపు గ్రూప్ లీడర్, నార్నెపాడు

ప్రత్యేక శ్రద్ధ చూపాలి



గ్రామాల్లో పొదుపు గ్రూపుల్లో వ్యవసాయ కుటుంబాలకు చెందిన మహిళలే. ప్రకృతి సాగు విధానం, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించుకుని తమ సంఘ సభ్యులను, కుటుంబ సభ్యులను చైతన్యం చేయాలి. ఇందులో ప్రధానంగా సమాఖ్య లీడర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– కె.అమలకుమారి, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ విభాగం

ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా..



ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. ప్రకృతికి అనుసంధానంగా చేసే ఈ సాగుకు పెట్టుబడి తక్కువే. ఐదేళ్లుగా చేస్తున్నా ప్రకృతి విపత్తులు, ఇతరత్రా ఇబ్బందులు తలెత్తలేదు. చీడ పీడల నివారణకు స్థానికంగా దొరికే వాటితోనే కషాయాలు స్వయంగా చేసుకోవచ్చు. పొదుపు మహిళలకు ఇకపై స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

- రేణుకాదేవి, పొదుపు గ్రూప్ లీడర్, గుత్తికొండ

కాలుష్య రహిత వాతావరణం..



ప్రతి మహిళా సంఘంలో ప్రకృతి వ్యవసాయం ప్రత్యేక అజెండా అంశంగా చేర్చాలి. ఈ సాగు ద్వారా కాలుష్య రహిత వాతావరణాన్ని నిర్మించవచ్చు. ఆరోగ్యమైన ఆహారం తీసుకోవచ్చు. సారవంతమైన భూమిని భావితరాలకు అందించవచ్చు. ఈసాగు చేసే మహిళలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించనుంది.

– జి.కుమారి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

ఇండస్ట్రియల్ హబ్‌గా ఆటోనగర్‌ను తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- కేసానుపల్లి సమీపంలో ఆటోనగర్‌కు శంకుస్థాపన
- మొదటి విడతలో 19 ఎకరాలు కేటాయింపు
- హాజరైన ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి




శంకుస్థాపన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట రూరల్: కేసానుపల్లి సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేసానుపల్లి పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆటోనగర్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఏపీఐఐసీ చైర్మన్ జంకే వెంకటరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తో కలసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటు గత 40 సంవత్సరాలుగా కలగా మిగిలిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసరావుపేట పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతలో 19 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆటోనగర్ యూనియన్‌లో 550 మంది సభ్యులు ఉన్నారని వీరందరికి స్థలాలు కేటాయించాలంటే మరో 20 ఎకరాలు అవసరం ఉందని చెప్పారు. ఆ భూమిని కూడా రైతుల నుంచి సేకరించి పూర్తి స్థాయిలో ఆటోనగర్‌ను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. నరసరావుపేట పట్టణానికి నూతనంగా వచ్చే బైపాస్ రోడ్డు ఆటోనగర్ సమీపంలోకి వస్తుందని తెలిపారు. చిలకలూరిపేట రోడ్డు నుంచి నేరుగా ఆటోనగర్‌లోకి వచ్చేందుకు 40 అడుగుల రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. స్థలాలను పొందిన వారు విక్రయించుకునే విధంగా సేల్ డీడ్‌లుగా ఇస్తామని చెప్పారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.9 కోట్లు నిధులతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ తాను బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి శంకుస్థాపన నరసరావుపేట ఆటోనగర్ కోసం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన నరసరావుపేటకు మంచి ఆటోనగర్ అవసరం అన్నారు. ఆటోనగర్ విస్తరణకు అవసరమైన మరో 20 ఎకరాలను సీఎం వైఎస్ జగన్ సహకారంతో సమీకరిస్తామని తెలిపారు. పేదలకు మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ కాకుమాను సదాశివరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సుజాతపాల్, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎంపీపీ ఎం.శ్రీనివాసరావు, ఎం.శివారెడ్డి, వంపుగుడి జాన్, రాజేష్, అక్బాబ్, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు పఠాన్ మొహిద్దీన్, కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగయాహే రంజాన్

నెలవంక నవ్వులలో..

- నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం
- ఆహారం నుంచి ఆహార్యం వరకు ప్రతిదీ ప్రత్యేకమే
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆధ్యాత్మిక శోభ



యడ్లపాడు: ఆధ్యాత్మిక జీవనం, ఖురాన్ పఠనం, నమాజ్, జకాత్, ఫిత్రా దానాలు, రోజా(ఉపవాస దీక్షలు).. సాయంత్రం ఇఫ్తార్‌తో ఇట్టే గడిచే పవిత్ర రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమైతే.. మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షల్ని ముస్లింలు ప్రారంభించనున్నారు.

అధిక పుణ్య ఫలం

ఆధ్యాత్మిక పరంగా రంజాన్ దీక్షలను పాటించిన వారికి అల్లాహ్ 70 రెట్ల పుణ్య ఫలం ప్రసాదిస్తారని ఇస్లాం గ్రంథాలు బోధిస్తున్నాయి. ఈ నెలలో 'నఫీల్' చదివితే 'ఫరజ్' చదివినంతగా అంటే 70 సార్లు నమాజ్ చేసినంత పుణ్యం ప్రాప్తిస్తుంది. అంతేకాదు ఉపవాస దీక్షలు, దానధర్మాలు (జకాత్, ఫిత్రా)కు ముస్లింలు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం ఫిత్రా(నిర్ణీత దానం) తప్పనిసరిగా చేయాలని నియమం. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మసీదుల్లో రంజాన్ మాసం సందడి మొదలైంది. రంగులు వేసి, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు లేకుండా చూస్తున్నారు. గ్రామ, పట్టణ కూడళ్లలో రంజాన్ శుభాకాంక్షలు చెబుతూ ముస్లిం యువకులు ఫ్లెక్సీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు.

ఎంతో ప్రత్యేకం..

రంజాన్ నుంచి షవ్వాల్ మాసం వరకు సూర్యోదయం నుంచి తిరిగి చంద్రోదయం చూసే వరకు ఆచరించే రోజా(ఉపవాస దీక్షలు) ఎంతో విశిష్టతను కలిగి ఉన్నాయి. ఈ నెల రోజుల పాటు సహరీ నుంచి ఇఫ్తార్ వరకు అన్నపానీయాలే కాదు లాలాజలాన్ని నోటిలోకి చేరనివ్వరు. ఉపవాస దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలతో నిత్యం అల్లాహ్‌ను ఆరాధిస్తారు. నిత్యం ఐదు పూటల నమాజ్‌తో పాటు రాత్రి వేళ తరవీహ్ నమాజ్ పఠించడం రంజాన్ ప్రత్యేకత. పవిత్ర ఖురాన్ గ్రంథంలోని 30 భాగాలను రోజూ ఒకభాగాన్ని రకాతులుగా విభజించి ఈ తరావీహ్ నమాజ్‌లో పఠించడం విశేషం. మామూలు వ్యక్తిని మహోన్నతునిగా మార్చే మాసం కాబట్టే దీనిని వరాల మాసంగానూ వ్యవహరిస్తారు.

రంజాన్ స్పెషల్ హలీం..

ఇఫ్తార్ సమయంలో ముస్లింలు సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలతో దీక్షను విరమిస్తారు. వీటిలో హలీం ఒకటి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున రంజాన్ స్పెషల్ హలీం విక్రయాల కోసం స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో హలీం, హరిస్ సెంటర్లు, వేడివేడి సమోసాలు, పెరుగువడ, ఫలహార విక్రయ దుకాణాలు వెలిశాయి.

'రోజా' దైవాదేశం



మానవాళికి సర్వశుభాలను చేకూర్చే మాసం పవిత్ర రంజాన్. ఈ మాసంలో స్వర్గ ద్వారాలు తెరిచే ఉంటాయి. మనిషి సహనంతో పాటు ఆకలిని తట్టుకునేలా చేసేది రంజాన్ మాసం. ఉపవాసాల ఉద్దేశాన్ని, పవిత్ర ఖురాన్ అవతరణ లక్ష్యాన్ని అర్థం చేసుకుని రంజాన్ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బాలింతలు, రుతుక్రమంలో ఉన్న స్త్రీలు, రోగ గ్రస్తులు మినహా ప్రతి ముస్లిం రోజాను విధిగా పాటించి అల్లాహ్‌కు కృతజ్ఞతలు సమర్పించుకోవాలి.

– ముక్తరుల్లాషా ఆమిరి, మతగురువు.

క్లుప్తంగా

సామరస్యం, ఆనందం వెల్లివిరియాలి



సాక్షి, నరసరావుపేట: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేసే పల్నాడు జిల్లా ముస్లింలకు అల్లా ఆశీస్సులు, కృపాకటాక్షాలు కలగాలని నరసరావు పేట పార్లమెంటు ఇన్‌చార్జ్ డాక్టర్ పి. అనిల్ కుమార్ ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని కోరారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్‌మాసం విశిష్టతని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్‌అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరసోదరీమణులంతా నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని ఆయన తెలిపారు.

అల్లాహ్ ఆశీస్సులు ఉండాలి



సత్తెనపల్లి: అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ఆకాంక్షించారు. నెలవంక దర్శనంతో మంగళవారం నుంచి ఉపవాసదీక్షలు చేపడుతున్న ప్రతి ఒక్క ముస్లిం సోదరుడికి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్

441మంది గైర్హాజరు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సీనియర్ ఇంటర్ గణితశాస్త్రం-2బీ పరీక్షలో ఒక విద్యార్థి డిబార్‌కు గురయ్యాడు. చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడినట్టు పరీక్షల ప్రత్యేక అధికారి టి.శేఖర్‌బాబు తెలిపారు. కాగా, పల్నాడుజిల్లా పరిధిలో సోమవారం 441మంది విద్యార్థులు సీనియర్ ఇంటర్ పరీక్షకు గైర్హాజరైనట్టు ఆయన పేర్కొన్నారు. జనరల్ ఇంటర్‌లో 11,761మందికి గాను 11,357మంది హాజరయ్యారు. మరో 400మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 595మందికి గాను 551మంది హాజరు కాగా 41మంది గైర్హాజరయ్యారు.

ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- అదనపు ఎస్పీ రాఘవేంద్ర
- పోలీసు స్పందనలో పలువురి నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నరసరావుపేట: జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'కు అదనపు ఎస్పీ (అడ్మిన్)ఆర్. రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలపై ఫిర్యాదులు స్వీకరించారు. వాటికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని సూచించారు. ఫిర్యాదులు అందజేసేందుకు వచ్చిన వారికి అన్నదానం చేశారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదుదారు నుంచి సమస్యను వింటున్న అదనపు ఎస్పీ రాఘవేంద్ర

వేధింపుల నుంచి రక్షించండి

గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నా భర్త ఇంట్లో లేని సమయం చూసి తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని వేధిస్తున్నాడు. నేను ఒప్పుకోనందున నా ఆస్తులను నాశనం చేస్తూ, కత్తితో పొడిచి చంపుతానని బెదిరిస్తున్నాడు. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, వెల్దుర్తి

కొన్న క్వారీని రాయమని అడిగితే దౌర్జన్యం

నేను మిత్రుడితో కలిసి గ్రానైట్ క్వారీ నడుపుతూ పక్కనే ఉన్న మరో క్వారీని రూ.22లక్షలు చెల్లించి కొనుగోలు చేశా. దాన్ని నా పేరుపై రాయమంటే రాయకుండా, తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. అడిగితే కొట్టేందుకు వస్తున్నారు. నాకు న్యాయం చేయండి.

–నార్నె హనుమంతరావు, పోలిరెడ్డిపాలెం, చిలకలూరిపేట మండలం

వేధిస్తున్న తెలంగాణ పోలీసులు

నేను గ్రామంలోని అమూల్ పాలకేంద్రం నిర్వహిస్తుంటా. తుమ్మలచెరువులో పెట్రోలు బంకు మేనేజర్‌గా కూడా పని చేస్తుంటా. అయితే, తెలంగాణ పోలీసులు నన్ను కొంతకాలంగా విచారణ పేరుతో పోలీసుస్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారు. నాపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. స్టేషన్‌కు రమ్మనమని పిలిచి సాయంత్రం వరకు కూర్చోబెట్టి పంపిస్తున్నారు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పట్లేదు. నాకోసం మా ఊరికి వచ్చిన పోలీసులను గ్రామస్తులు నిలదీశారు. దీంతో వారు సమాధానం చెప్పకుండా ఉడాయించారు. దీనిపై విచారించి నాకు న్యాయం చేయండి.

– గుబిలి శ్రీనివాసరావు, పెద్దకొదమగుండ్ల, కారంపూడి

కుమారుడు మృతిపై అనుమానం

నా పెద్దకుమారుడు సత్తెనపల్లిలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో చనిపోయాడు. ఆ మృతిపై మాకు అనుమానం ఉంది. విచారించి తగిన న్యాయం చేయండి.

–ఓ మహిళ, సత్తెనపల్లి పట్టణం

పెట్రోలు బంకుల ద్వారా ఆదాయం పెంపు

- కలెక్టరు లోతేటి శివశంకర్
- పల్నాడు జిల్లాలో నూతనంగా రెండు పెట్రోలు బంకులు మంజూరు
- నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన జిల్లా కలెక్టరు

శావల్యాపురం: పెట్రోలు బంకుల ద్వారా ఆదాయం పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శావల్యాపురం మండలం కనమర్లపూడి జాతీయ రహదారి మార్గం వెంబడి ప్రభుత్వ స్థలం 30 సెంట్లలో సోమవారం భారత్ పెట్రోలియం సారథ్యంలో నూతన పెట్రోలు బంకు ఏర్పాటుకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొదట దశలో మూడు బంకులు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా నరసరావుపేట పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో రూ.2.80కోట్లతో నూతన బంకు ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా నెలకు రూ. 3 లక్షల ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. నూతనంగా కనమర్లపూడి, మాచర్ల ఏరియాల్లో కోటి రూపాయల చొప్పున వ్యయంతో బంకులు ఏర్పాటుకు భూమి పూజ చేశామని తెలిపారు. రెండు నెలల్లో పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ఇందులో వచ్చే ఆదాయం 25 శాతం వరకు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు ఆదాయాన్ని పేదలకు సంక్షేమ పథకాలు రూపంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పెట్రోలు బంకుల్లో స్థలాల్ని ఏటీయం సెంటర్లు, వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.సరోజని, తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య, మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, సీఎస్‌డీటీ విద్యాసాగర్, భారత్ పెట్రోలియం సూపర్‌వైజరు చంద్రకాత్ నాయక్, డెప్యూటీ తహసీల్దారు పెరిసోముల నాసరయ్య, వీఆర్వో ఉప్పులూరి చిన మంగయ్య, పంచాయతీ కార్యదర్శి దారివేముల రవీంద్ర, మహేంద్ర, గ్రామ సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్

మేదరమెట్ల సిద్ధం సభ చారిత్రాత్మకం

- ఎల్లో దుష్ప్రచారం చేసినా సాధించేది శూన్యం
- తరలివచ్చిన వారికి కృతజ్ఞతలు
- ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్



మాచర్ల: రాష్ట్రంలో అత్యంత అద్భుతంగా లక్షలాది మంది ఆదరణతో దక్షిణ భారతదేశ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా నాల్గవ విడత సిద్ధం సభ నిర్వహించి దేశ చరిత్రలో రికార్డు సృష్టించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదేనని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజల ఆకాంక్షలు, సంక్షేమం, అభివృద్ధి నెరవేరుస్తున్న సీఎం జగన్‌పై ఆదరణ చూపి లక్షలాది మంది పోటీపడి మేదరమెట్ల నాల్గవ విడత సిద్ధం సభకు తరలివచ్చారని తెలిపారు. దీన్ని చూసి తట్టుకోలేని ఎల్లో మీడియా, తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలందరి కళ్లకు కట్టినట్లు సభకు జనం వస్తే, కళ్లు మూసుకుపోయినట్లు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖండించారు. టీడీపీ ఎంత మందితో పొత్తులు పెట్టుకున్నా, రాష్ట్రంలో ఇటువంటి సభల్ని నిర్వహించే ధైర్యముందా? అని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం వల్లే పేద ప్రజలంతా స్వచ్ఛందంగా గంటల కొద్దీ వేచి ఉండి సీఎం జగన్ ప్రసంగాన్ని వినటానికి ఆసక్తి చూపారని తెలిపారు. ఇదంతా చూడకుండా దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా నిజాలు దాచాలన్నా దాగవని వివరించారు. మాచర్ల నియోజక వర్గం నుంచి 20వేల మంది అత్యధికంగా సభలో పాల్గొన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త, అభిమానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

జపాన్‌లో నర్సింగ్ ఉపాధికి శిక్షణ

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవిస్ హెచ్‌ఆర్ సంస్థ సహకారంతో జపాన్‌లో ఉపాధి అవకాశాల్ని సులభతరం చేసేందుకు నిరుద్యోగ నర్సింగ్ యువతకు జపనీస్ భాష శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా అధికారి కె.సంజీవరావు సోమవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం విద్యార్హత కలిగి 32 సంవత్సరాల వయస్సులోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జపనీస్ భాషలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు బెంగుళూరులో ఆరు నెలల కాల వ్యవధితో కూడిన రెసిడెన్సియల్ క్లాస్‌రూమ్ శిక్షణ అందిస్తారని వివరించారు. శిక్షణ రుసుం రూ.3.50లక్షలు ఉంటుందని తెలిపారు. దీనిలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలు, శిక్షణ రుసుం రూ.3లక్షలని పేర్కొన్నారు. అభ్యర్థులందరికీ తమ సంస్థ తరపున రూ.25వేలు స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. అభ్యర్థులు శిక్షణ రుసుంను మూడు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు ఉందని తెలిపారు. అభ్యర్థి చెల్లించిన ఫీజును జపనీస్ భాష, సంస్కృతి, మర్యాద, క్లయింట్ ఇంటర్వ్యూ మొదలుకొని ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూ మద్దతు, వీసా స్టాంపింగ్ సహా ఉద్యోగంలో చేరే వరకు వినియోగిస్తారని వివరించారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ. 1.10లక్షల నుంచి రూ.1.40లక్షల వరకు జీత భత్యాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం http://www.aprrdc.in/home/o nine Pso fram లింక్ ఉపయోగించాలని తెలిపారు. వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్ 9988853335లో సంప్రదించాలని సూచించారు.

43 మంది ఫార్మసిస్టులకు రెగ్యులర్ ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 43 మంది ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేస్తూ సోమవారం ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది, ప్రకాశం జిల్లాలో 20 మంది, నెల్లూరు జిల్లాలో 8 మంది కాంట్రాక్టు గ్రేడ్-2 ఫార్మాసిస్టులను సోమవారం రెగ్యులర్ చేశారు. గుంటూరులోని ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి రెగ్యులర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జగనన్న కోసం నేను సైతం..

ద్విచక్ర వాహనంపై ప్రొద్దుటూరుకు చెందిన అమర్‌నాథ్ ప్రచారం

దాచేపల్లి : నా కోసం ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్ క్యాంపెయినర్ రావాలని జగనన్న పిలుపునందుకుని ఓ వీరాభిమాని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన రామిరెడ్డి అమర్‌నాథ్ రెడ్డి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఉద్యోగాన్ని పక్కనపెట్టి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారాలు చేస్తూ సోమవారం దాచేపల్లికి చేరుకున్నారు. జగనన్నని మరోసారి సీఎంగా చూడాలనే ఆకాంక్షతో ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టానని ఆయన చెప్పారు. విశాఖపట్నం సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో అమర్‌నాథ్ రెడ్డి క్వాలిటీ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. మరో 45 రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాన్ని వదిలిపెట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన నాలుగు సిద్ధం సభలకు వెళ్లారు. వాటిల్లో సీఎం జగన్ నా కోసం మీరే స్టార్ క్యాంపెయినర్లుగా రావాలని పిలుపునివ్వటంతో అమర్‌నాథ్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై ప్రచారం చేస్తున్నారు. దానికి, హెల్మెట్‌కి వైఎస్సార్ సీపీ స్టిక్కర్లు వేయించారు. చిన్న మైక్ ఏర్పాటు చేసుకుని జనం ఎక్కువగా ఉన్న చోట ఆగి పథకాలు, అభివృద్ధి గురించి ప్రచారం చేస్తున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన ప్రచారానికి మద్దతు తెలిపి అండగా ఉంటున్నారు. జగనన్నని మరోసారి సీఎం చేయడమే తన కర్తవ్యమని తెలిపారు. తనలాగే ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేస్తే 175కి 175 సీట్లు గెలుచుకుని జగనన్నని సీఎంగా చూడవచ్చని చెప్పారు. అమర్‌నాథ్‌రెడ్డికి భార్య మనోజ్ఞ, ఏడాది వయస్సున్న పాప నివేదితారెడ్డి ఉన్నారు.



దాచేపల్లిలో ద్విచక్ర వాహనంపై ప్రచారం చేస్తున్న అమర్‌నాథ్

ఆచరణలో మహిళా సాధికారత చూపిన జగనన్న

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత ఆచరణలో చూపిందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జెడ్పీ ఇంజినీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులకు ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో పయనించాలని, పురుషులతో సమానంగా పోటీతత్వంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు, చర్యలతో సమాజం సైతం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినాను పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీ అధికారులు, ఉద్యోగినులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, జెడ్పీ సీఈవో సతీమణి, లక్ష్మీకుమారి, డెప్యూటీ సీఈవో సతీమణి సోనియా, కాకుమాను జెడ్పీటీసీ గుల్జాన్ బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీలు, మహిళా అధికారులు, ఉద్యోగినులతో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

వేధిస్తున్నాడని.. బండరాయితో కొట్టి చంపాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పట్నంబజారు: వ్యక్తి తలపై బండరాయితో మోది హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌వో పి. దేవప్రభాకర్ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన తోట శ్రీను అలియాస్ సిద్దార్థ (32) చిన్ననాటి నుంచి జులాయిగా తిరుగుతూ.. తాగుడుకు బానిసగా మారాడు. కొన్నిరోజుల క్రితం గుంటూరుకు వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ.. లాడ్జిల్లో, రోడ్లపై నిద్రిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మీదేవి కాలువ గ్రామానికి చెందిన బొమ్మగాని సతీష్ క్యాటరింగ్ పనులు చేసుకునేందుకు రెండు సంవత్సరాల క్రితం గుంటూరుకు వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. అయితే, నిత్యం శ్రీను మద్యం కోసం డబ్బులు లేవని సతీష్ వద్ద లాక్కుంటూ ఉండేవాడు. అనేక రకాలుగా బెదిరిస్తూ.. నిందితుడి వద్ద డబ్బులు తీసుకునే వాడని పోలీసుల తెలిపారు. మృతుడు శ్రీను వేధింపులు తట్టుకోలేని సతీష్ గత నెల 25వ తేదీ రాత్రి పూటుగా మద్యం తాగించాడు. ఆదివారం సమయం.. దుకాణాలు కూడా మూసివేసి ఉండటంతో ఏలూరు బజారుకు తీసుకుని వచ్చి అక్కడ శ్రీనుపై సతీష్ దాడి చేశాడు. బండరాయితో మొహంపై గట్టిగా మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితుడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 10న ఏటుకూరు రోడ్డులో ఉన్నాడని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించటంతో హత్యకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎం. సుబ్బారావు, సిబ్బంది కిరణ్, శంకర్, రవి, నజీర్, దేవభిక్షంలను ఎస్‌హెచ్‌వో దేవ ప్రభాకర్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్, చిత్రంలో వెనుక ముసుగులో నిందితుడు

అతి వేగమే ప్రాణం తీసింది !

తాడేపల్లిరూరల్ : స్థానిక కుంచనపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకకు చెందిన బత్తుల రాజీవ్ దుర్గాకుమార్, శివనాగ ప్రమీల కుమారుడు బత్తుల కుషిల్ (19) వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అయితే తన స్నేహితుడు హర్షవర్ధన్ కారులో వస్తుండగా కుంచనపల్లి రోడ్డు వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ఐరన్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తుల కుషిల్ తీవ్రంగా గాయపడగా హర్షవర్ధన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ ఇరువురిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా కుషిల్ మృతి చెందాడు. జరిగిన ఈ సంఘటనపై తండ్రి రాజీవ్ దుర్గాకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అతి వేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.219/2019/ఎ4 తేది.11-03-2024

నరసరావుపేట పురపాలక సంఘమునకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది.01-04-2024 నుండి ది.31-03-2025 వరకు ఈ దిగువ తెలిపిన మార్కెట్‌లలో ఆశీలు వసూలు చేసుకొను హక్కును గజిట్ షరతులకు లోబడి నిర్వహించుకొనుటకు గాను ది.18-03-2024 సోమవారం ఉదయం గం॥ 11.00 పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలము శ్రీయుత కమీషనర్ వారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని నిర్వహించబడును. ఏ కారణము చూపకయే వేలంను వాయిదా వేయుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారం కలదు.

క్ర. నెం.	మార్కెట్ల వివరము	కమీషనరు/తహశీల్దారు వార్లచే జారీ చేయబడిన ఆస్తి విలువ/సాల్వెన్సీ ధృవపత్రము	వేలంపాటసమయమున ముందుగా చెల్లించవలసిన డిపాజిట్ ధరావత్తు
1	దినసరి కూరగాయల మార్కెట్ (హోల్‌సేల్ & రిటైల్)	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
2	సంక్రాంతి మార్కెట్	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
3	చేపలు & మాంసం మార్కెట్	రూ. 2,00,000.00	రూ. 25,000.00
4	కబేళా – 1	రూ. 50,000.00	రూ. 25,000.00
5	కబేళా – 2	రూ. 50,000.00	రూ. 25,000.00

పాటలో పాల్గొనదలచిన వారికి సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు సబ్-రిజిస్ట్రార్ వారిచే జారీచేయబడిన ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్ లేనిచో సాల్వెన్సీ బదులుగా చూపబడిన నగదు దాఖలు చేసి వేలంలో పాల్గొనవలెను. సదరు ఆస్తికి సంబంధించి ఏ విధమైన వివాదాలు లేవని వ్యక్తిగత ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలుతో పాటుగా మరియు పాటకు ముందుగా నిర్ణయించిన ధరావత్తును నగదు రూపంలో చెల్లించి మాత్రమే వేలం పాటలో పాల్గొనవలసియుండునని తెలియజేయడమైనది.

గమనిక: ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనర్, నరసరావుపేట మునిసిపాలిటీ.